# తగ్గిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

- పంటల దిగుబడిపై రైతుల ఆందోళన
- బొంరాస్‌పేట మండలంలో యాసంగిలో 13 వేల ఎకరాల్లో వరిసాగు



బాపల్లితండాలో బోర్లలో నీటిమట్టం తగ్గి నీరందక ఎండిన వరి పంటలు

బొంరాస్‌పేట, మార్చి 3 : వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. గత ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో బోర్లలో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. వ్యవసాయానికి గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం, వరుసగా కొన్నేళ్ల నుంచి సమృద్ధిగా కురిసిన వర్షాల వల్ల వ్యవసాయ బోర్లలో సమృద్ధిగా నీళ్లుండేవి. దీంతో రైతులు గత కొన్ని సంవత్సరాలుగా బోర్ల కింద యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటలను సాగు చేశారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఈ ఏడాది కూడా బోర్లలో నీళ్లున్నాయని నమ్మిన రైతులు ఎప్పటిలాగే బోర్ల కింద యాసంగిలో వరినాట్లు వేశారు. కానీ ఎండలు ముదురుతున్న కొద్దీ బోర్లలో నీటిమట్టం తగ్గిపోతుంది. ఫలితంగా వరి పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. బొంరాస్‌పేట మండలంలో ఈ ఏడాది యాసంగిలో చెరువులు, బోర్ల కింద 13 వేల ఎకరాలలో వరినాట్లు వేశారు. చెరువుల కింద వరి పంటలు ఆశాజనకంగా ఉన్నా బోర్ల కింద సాగు చేసిన పంటలు నీరందక ఎండి పోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బాపల్లితండాలో బోర్లలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో వరి పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నీటిమట్టం తగ్గి బోర్లలో సన్నటి ధారలాగా నీళ్లు వస్తున్నాయని, రోజంతా పారబెట్టినా పొలమంతా పారడం లేదని రైతులు వేదన చెందుతున్నారు. నీరందక వరిపొలాలకు నెర్రెలు వస్తున్నాయి. ఇప్పుడిప్పుడే బోర్లలో నీటిమట్టం పడిపోతుందని, రాబోయే రోజుల్లో నీళ్లు ఇంకా తగ్గి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతే దిగుబడి తగ్గి నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈర్లపల్లి సమీపంలో బోరులో సన్నటి ధారగా వస్తున్న నీరు

**అర ఎకరం ఎండిపోయింది**



నాకు రెండు ఎకరాల పొలం, రెండు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. యాసంగి లో రెండు ఎకరాలలో వరినాట్లు వేశాను. కొన్ని రోజులుగా రెండు బోర్ల లో నీటిమట్టం తగ్గిపోయింది. అర ఎక రం వరిపంట ఎండిపోయింది. తండా లో ఇంకా కొంతమంది రైతుల బోర్లలో కూడా నీటిమట్టం తగ్గి వరి పంటలు ఎండిపోతున్నాయి. పంటలు ఎండిపోతే నష్టం వస్తుంది. పెట్టుబడి అయినా వస్తుందో రాదోనని ఆందోళనగా ఉంది.

– తార్యానాయక్, బాపల్లితండా

# పోలియో రహిత సమాజం కోసం...

- చిన్నారులకు చుక్కల మందు పంపిణీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



తాండూరు: చుక్కల మందు వేస్తున్న ఎస్సై కాశీనాథ్, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్



కొడంగల్ : బస్టాండ్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మెప్మా సిబ్బంది

తాండూరు, మార్చి 3: పోలియో వ్యాధి సోకకుండా ఉండేందుకు భారత ప్రభుత్వం 0–5 సంవత్సరాల పిల్లలకు ఆదివారం చేపట్టిన పల్స్‌పోలియో చుక్కల మందు వితరణ కార్యక్రమం తాండూరు నియోజకవర్గంలో విజయవంతంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. తాండూరులో 94 శాతం చుక్కల మందు వేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో కూడా చుక్కల మందు వేస్తామని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరిధర్ తెలిపారు.

**కొడంగల్:** మండల పరిధిలో 5,904మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాల్సిన లక్ష్యం ఉండగా ఆదివారం 5,0591మందికి వేసినట్లు అంగడిరైచూర్ మెడికల్ ఆఫీసర్ డా. హరిప్రసాద్ తెలిపారు. మొత్తల నాలుగు రూట్‌లు, 36 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు



బొంరాస్‌పేట: ఇటుకబట్టీ వద్ద ...

తెలిపారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా.రవీంద్రయాదవ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**వికారాబాద్:** వికారాబాద్ పట్టణంలోని వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, జన సంచారం ఉన్న ప్రదేశాల్లో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

**బొంరాస్‌పేట:** మండలంలో5150 మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలని లక్ష్యం కాగా ఆదివారం 90 శాతానికి పైగా పిల్లలకు చుక్కల మందును పంపిణీ చేశారు. 50 బూత్‌లను, ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేశారు. ఎంపీపీ హేమీబాయి, మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్, సీహెచ్‌వో శివరాజ్, ఆయుష్ ఫార్మాసిస్ట్ సుదర్శన్ రావు చిన్నారులకు చుక్కల మందు వేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్ మండలంలో పల్స్ పోలియోను పరిశీలించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కులకచర్ల:** పల్స్ పోలియోను నిర్మూలిద్దామని కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కులకచర్ల వైద్యాధికారి వాజిహుద్దీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర ప్రారంభించారు. పోలియో రహిత సమాజం కోసం 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలందరికి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీటీసీ చెలిమిళ్ల ఆనందం, హెల్త్‌అసిస్టెంట్ వెంకటయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఏఎన్‌ఎం జంగమ్మ, ఆశవర్కర్ లావణ్య, గ్రామస్తులు వెంకటయ్య, గోపాల్, భీమయ్య, రాజు పాల్గొన్నారు. అలాగే చౌడాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని సీహెచ్‌వో చంద్రప్రకాశ్ ప్రారంభించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పోలియో చుక్కలు వేయించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ ఎంఎల్‌పీహెచ్‌సీ ప్రశాంతి, రూట్ సూపర్ వైజర్ యాదమ్మ, జంగమ్మ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

**దోమ:** మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి చిన్నారులకు



ధారూరు: మున్నూరు సోమారం గ్రామంలో ...

పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సత్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త బీమమ్మ, బుక్‌కీపర్ భాగ్యమ్మ, మైనారిటీ నాయకుడు మైనోద్దీన్ పాల్గొన్నారు.

**పరిగిటౌన్:** పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలతో ప్రతి వార్డుల్లో అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలల ప్రాంగణంలో పోలియో చుక్కుల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలను తమ తల్లిదండ్రులు పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించారు.

**ధారూరు:** పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి పర్వీన్‌కుమార్ అన్నారు. ఆదివారం ధారూరు మండల కేంద్రంలోని పోలియో కేంద్రాన్ని పర్యవేక్షించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధారూరు పరిధిలో 15 , నాగసముందర్ పరిధిలో 18 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2494మంది పిల్లలకు గాను 2369 మంది పిల్లలకు , నాగసముందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2930మంది పిల్లలకు గాను 2808మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.



పరిగి టౌన్: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కౌన్సిలర్ అనసూయ



కులకచర్ల: చౌడాపూర్‌లో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న సీహెచ్‌వో చంద్రప్రకాశ్

## ఎలక్ట్రానిక్ దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న ఎలక్ట్రానిక్ దుకాణం

తాండూరు, మార్చి 3: తాండూరు పట్టణం భద్రేశ్వర దేవాలయం సమీపంలోని ఎలక్ట్రానిక్ దుకాణంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక నేతలు, అధికారులతో పాటు దుకాణం నిర్వాహకుడు పాష తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలా దుకాణం మూసి ఇంటికి వెళ్లిన సమయంలో దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలిపారు. స్థానికులతో విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న సుమారు రూ. 5 లక్షల విలువైన వస్తువులు కాలిపోయినట్లు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందిచేందుకు కృషి చేస్తామన్నారు. దుకాణదారులందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఎండాకాంలో దుకాణాల నిర్వాహకులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత



మర్పల్లి, మార్చి 3: సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోని బాధితులకు అందజేస్తున్నట్లు మర్పల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు నెలల క్రితం మండల కేంద్రానికి చెందిన సుధాకర్ సెల్‌ఫోన్ పోయింది. ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించారు.



కులకచర్ల, మార్చి 3 : మండల పరిధిలోని చెరువుముందలితండాలో ద్వాదశ జ్యోతిర్లింగా మహాపడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శివమహాపడిపూజ కార్యక్రమం సందర్భంగా గణపతిహోమం, సుబ్రహ్మణ్యం పూజ, నవగ్రహాల పూజ, శివుని మహారుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను 12 జ్యోతిర్లింగాలకు పడిపూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



భద్రేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 3: తాండూరు పట్టణంలోని శ్రీభావిగి భద్రేశ్వర దేవాలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. అంతకు ముందు పట్టణంలో శివ పార్వతుల విగ్రహాలను భాజా భజంత్రీలతో ఊరేగించారు. కల్యాణాన్ని తిలకించేందుకు తాండూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది జనం తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. శివస్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గురుకుల ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం



కులకచర్ల, మార్చి 3: తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పి. రమాదేవి, పి శేఖర్, శ్రీనివాస్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో గ్రామస్తులు ఆదివారం ముగ్గురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నయ్య యాదవ్, ఎం. రాములు గౌడ్, నర్సింహులు, ఉమాశంకర్‌గౌడ్, భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బీటీ రోడ్డు మంజూరు చేయాలి

కులకచర్ల, మార్చి 3: చౌడాపూర్ మం డల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామం నుంచి ఫతేపూర్ వరకు బీటీ రోడ్డు మం జూ రు చేసే విధంగా చూడాలని చాకల్ గ్రా మానికి చెందిన నాయకులు శేఖర్ ఆధ్వ ర్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యె న్నం శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం సమ ర్పించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఇచ్చిన లెటర్‌ను ఆయనకు అందజేశారు.

### తైక్వాండో సమావేశం

వికారాబాద్, మార్చి 3 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివరాంనగర్ కాలనీ శ్రీ వివేకావాణీ విద్యాలయంలో ఆదివారం తైక్వాండో అసోసియేషన్ జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించరు. అందులో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ఛైర్మన్ రాఘువన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, వికారాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### అయోధ్య ప్రసాదం పంపిణీ

కులకచర్ల, మార్చి 3 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో హిందూఉత్సవ సమితి ఆద్వర్యంలో ఇంటింటికీ అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముడి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆయోధ్యకు వెళ్లని వారికి శ్రీరాముని ప్రసాదాన్ని ఇంటివరకు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. శ్రీరాముని దర్శనంతో జన్మధన్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూఉత్సవ సమితి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్‌ను నిషేధించాలి

కులకచర్ల, మార్చి 3: ప్లాస్టిక్‌ను నిషేధించాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో, సంతల్లో గొనె సంచులను అందజేస్తున్నామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అక్క మీరా కుమారి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కులకచర్ల, బండవెల్కిచర్ల అం గడిబజార్లలో ప్రజలకు గొనె సంచులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్లాస్లిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు శ్రీనివాస్, హన్మంతు, నరసింహారెడ్డి, కేవీఆర్ ఫౌండేషన్ పరిగి ఇన్‌చార్జి రామచంద్రయ్య, బైరం నరేశ్, అనంతయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహావిష్కరణ

యాలాల, మార్చి 3 : మండలంలోని అగ్గనూరు గ్రామంలో వివేక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పౌరులంతా ఛత్రపతి శివాజీ వీరత్వాన్ని అందిపుచ్చుకొని నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, తాండూరు పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ సర్పంచ్ భీమప్ప, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్ నీరజ, మురళిగౌడ్ పాల్గొన్నారు.

### పూడూరు మండలంలో..

పూడూరు,మార్చి 3: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ముందుండాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండలం కంకల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎంపీ కె.విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సంప్రదాయలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ నాయకులు మారుతి కిరణ్, ఎంపీపీ మల్లేశం. జడ్పీటీసీ మేఘమాల, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాధవ రెడ్డి, అడ్వొకేట్ ఆనందం, ప్రభాకర్‌గుప్త, రఘుపంతులు, పూడూరు మల్లేశం, పెంటయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అని ల్, రవిందర్, వీరేశం, శ్రీనివాస్ ఉన్నారు.

## భార్యను కొట్టి చంపాడు..

పూడూరు, మార్చి 3 : మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నావని ఆరోపిస్తూ ఓ ప్రబుద్ధుడు కట్టుకున్న భార్యను కొట్టి చంపాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పరిగి సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలో నిదేవనోనిగూడ గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో ప్రమిల(32) వివాహం 11 ఏండ్ల క్రితం జరిగింది. శనివారం ప్రవీణ్ తన భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఆ కోపం తో మరో వ్యక్తితో వివాహేతర సంబం ధం పెట్టుకున్నావని ఆరోపిస్తూ భార్యను తీవ్రంగా గాయపర్చాడు. అనంతరం ఆమెను దవాఖాన కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# జాతరలో సందడే సందడి



బొమ్మల దుకాణం వద్ద కోలాహలం



కొలనులో చిన్నారులు

బొంరాస్‌పేట, మార్చి 3 : దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతరలో భక్తుల సందడి కనిపించింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనం చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏర్పాటు చేసిన మిఠాయి దుకాణాలు, ఆట వస్తువుల దుకాణాలు, మహిళల అలంకరణ సామగ్రి, గాజుల దుకాణాల వద్ద భక్తుల కొనుగోలుతో సందడి కనిపించింది. రంగుల రాట్నం, జంపింగ్ జపాంగ్ వంటి వాటిపై ఎక్కి చిన్న పిల్లలు హుషారుగా కనిపిం చారు. ఆదివారం కావడంతో జాతరలో ఏర్పాటు చేసిన మటన్ దుకాణాల వద్ద విపరీతమైన గిరాకీ కనిపించింది. జాతర ప్రారం భమైన శుక్రవారం నుంచి ఆదివారం వరకు రాత్రి 12 గంటల వరకు కూడా భక్తులు దుకాణాలలో కొనుగోలు చేస్తూ కనిపించారు. వివిధ ప్రాంతాల నుండి జాతరకు వచ్చి విడిది చేసిన భక్తులు ఆదివారం తమ తమ స్వస్థలాలకు తరలి వెళ్ళారు. అంతకు ముందు ఉదయం ఎల్లమ్మ తల్లికి దేవస్థాన ఛైర్మన్ జయరాములు, మేనేజర్ రాజేందర్‌రెడ్డి, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

# నిరుపయోగం..

- రెండేండ్లుగా అందుబాటులోకి రాని మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణాలు
- రూ.20 లక్షల జడ్పీ నిధులతో నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన షాపుల వేలం పాట
- త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలంటు న్న యువత, చిరు వ్యాపారులు



పెద్దేముల్, మార్చి 3 : అధికారుల నిర్లక్ష్యంతో రూ.20 లక్షల జడ్పీ నిధులతో నిర్మించిన మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. రెండేండ్ల క్రితం నిర్మాణం పూర్తైనా నిర్వహణ లోపంతో రోజురోజుకూ శిథిలమైపోతున్నది. ప్రారంభించిన నాటి నుంచి అద్దెకు ఇవ్వకుండా.. వేలం వేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి దుకా ణ సముదాయాన్ని గాలికి వదిలేశారు. షాపులను అద్దెకు ఇస్తే పలువురికి ఉపాధి లభించడంతోపాటు మండల పరిషత్‌కు ప్ర తినెలా ఆదాయం వచ్చేందని పలువురు అభిప్రాయపడుతు న్నారు. మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణ సముదాయాన్ని ప్రారంభిం చిన తర్వాత నిబంధనల ప్రకారం వేలం వేస్తే పాటలో పాల్గొని షాపులను దక్కించుకుని చిరు వ్యాపారం చేసుకోవాలని చాలా మంది నిరుద్యోగ యువకులు గత రెండేండ్లుగా ఎదురు చూస్తు న్నారు. ఈ దుకాణాల సమీపంలోనే మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ ఆఫీస్, విద్యావనరుల కేంద్రం, రైతుసేవా సహకార సంఘం, సబ్‌స్టేషన్, పశు వైద్యశాల, పీహెచ్‌సీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వ్యాపారం బాగా సాగ డంతోపాటు గిరాకీ మంచిగా ఉంటుందని ఆశావహులు భావిస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా అధికారుల తీరు ఉన్నది. ఆ షాపులను వేలం వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నా రు. సుమారు 30 రోజుల క్రితం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి కాంప్లెక్స్ దుకాణాల విషయాన్ని పలువురు స్థానిక నాయకులు తీసుకెళ్లగా త్వరలోనే వాటిని నినియోగంలోకి తీసుకొస్తామని చెప్పినట్లు సమాచారం.

**అందుబాటులోకి తీసుకురావాలి..**



దుకాణాలను అధికారులు వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చి నాలాంటి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి. షాపులు వినియో గంలోకి వస్తే ప్రతి నెలా మండల పరిషత్‌కు ఆదాయం రావడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంది.

మహమ్మద్ ఇస్మాయిల్, నిరుద్యోగ యువకుడు, కందనెల్లి

**దుకాణాలను వేలం వేయాలి..**



ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాంప్లెక్స్ దుకాణాలను వేలం వేసి అర్హులకు కేటాయించాలి. వేలం వేస్తే బయటి షాపులతో పోల్చితే వీటికి అద్దె తక్కువగా ఉంటుంది కాబట్టి నిరుద్యోగులు వాటిని తీసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుంది. –ఎడ్ల కృష్ణ, చిరు వ్యాపారి, పెద్దేముల్

**త్వరలోనే షాపులను వేలం వేస్తాం..**



త్వరలోనే మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణాలకు వేలం వేసి అర్హులకు కేటాయిస్తాం. దాని ద్వారా ప్రతినెలా మండల పరిషత్‌కు ఆదాయం సమకూరడంతోపాటు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

–అనురాధారమేశ్, ఎంపీపీ, పెద్దేముల్

**త్వరలో అందుబాటులోకి..**



మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణ సముదాయానికి ఉన్న తాధికారుల అనుమతితో.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేసి అర్హులకు కేటాయిస్తాం. వీలైనంత త్వరగా షాపులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–జర్నప్ప, మండల ఇన్‌చార్జి ఎంపీడీవో, పెద్దేముల్